క్లుప్తంగా

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కొల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తరుణ్, రామకృష్ణ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదీన విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో వంశీ, చందు, వినయ్, శంకర్ ఉన్నారు.

రైతుబీమా నమోదు తప్పనిసరి



చారకొండ: మండలంలోని గ్రామాల్లో రైతులకు ఇటీవల పాసుపుస్తకాలు వచ్చిన రైతులు తప్పకుండా రైతుబీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఏఈఓలు సోమవారం రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

బిజినేపల్లి: కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం తప్పకుండా అందించాలని తిమ్మాజిపేట ఎంపీడీఓ కరుణశ్రీ సూచించారు. సోమవారం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేసే ఆహారంతో పాటు వారికి అందించే వంట సరుకులను పరిశీలించారు. ఇంటి వాతావరణంలో అందించే భోజనంలా ఉండాలన్నారు.

చర్యలు తీసుకోండి

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ బాసునాయక్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కన్వీనర్ చందు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువు తల్లిదండ్రులకు భారంగా మారిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు సైతం రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

జూపల్లిలో వైద్య శిబిరం

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్యయాదవ్, సర్పంచ్ మల్లీశ్వరి, గణేష్, బాల్‌రాజు, జగపతి, సిరాజ్ తదితరులు ఉన్నారు.

ఇంటి సామగ్రి పంపిణీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల చెందిన లక్ష్మమ్మకు ఇంటి నిర్మాణం కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50వేల విలువ గల ఇటుకను సోమవారం పంపించారు. గూడు లేని కుటుంబాలకు ఇల్లు కట్టించాలనే సంకల్పంతో ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గ్రామంలో పది మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ



ఊర్కొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల, రాచాలపల్లి పాఠశాలలో యూత్‌ఫర్ సేవ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు బ్యాగులను, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటరమణ. సంతోషి, లక్ష్మీ, నరేష్, అరుణ్ రెడ్డి, పరమేశ్వర్, మధు, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి శివారులో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించిన సమయంలో పట్టుబడిన మల్లేష్‌ను సోమవారం అచ్చంపేట కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మద్యం తాగి చిందులు వేసిన వ్యక్తికి న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్మికుల వంటావార్పు

జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండు చేస్తూ సోమవారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. 5వ రోజు నిరవధిక సమ్మె నిర్వహించి వంటలు చేసి సహపంక్తి భోజనం చేశారు. వారు మాట్లాడుతూ కరోనలాంటి క్లిష్ట సమయాల్లో తమ సేవలను ప్రభుత్వాలు వినియోగించుకుని, ఇప్పుడు కనీస వేతనం పెంచకపోవడం విచారకరమన్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సమ్మెను విరమించేది లేదని అన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



బిజినేపల్లిలో వంట చేస్తున్న పంచాయతీ కార్మికులు

పేదల సంక్షేమమే ధ్యేయం



పల్లెదవాఖానకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలోని పేదల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో బస్తీ దవాఖాన ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం మండలంలోని మార్చాల, తర్నికల్ గ్రామాలలో పల్లె దవాఖానలకు భూమి పూజ నిర్వహించారు. జీడిపల్లితండా, వెంకటాపూర్‌తండా, సుద్దకల్, తర్నికల్‌తండా, తుర్కలపల్లిలో పంచాయతీల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో ముఖ్యమైన రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు విడుదల చేయించడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోహర, వైస్ ఎంపీపీ గోవర్ధన్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మెన్‌పేటలో అధికారుల విచారణ

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలో సోమవారం డీఎల్‌పీఓ వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామ కంఠం భూమిలో అక్రమంగా వేసిన మొరం కట్టలపై సర్పంచ్ ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. అక్కడి ప్రజలతో విచారించగా అక్రమంగా గ్రామ కంఠం భూమిలో కట్ట వేయడం వలన వర్షం నీరు పంచాయతీ, అంగన్‌వాడీ పశువైద్యశాల భవనాల్లోకి వెళ్లడంతో పాటు రోడ్డుపై రాకపోకలు సాగించలేని పరిస్థితి వచ్చిందని తెలిపారు. అక్రమంగా కట్ట వేసిన పక్క పొలం భూ యజమానులు సుమలత, పుష్పలతలను అక్కడికి పిలిచి మొరం కట్టలను వెంటనే తొలగించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించగా, వెంటనే మొరం కట్టలను తొలగిస్తామని తెలిపారు. సర్వే అనంతరం హద్దులు ఏర్పాటు చేసి వర్షం నీరు భవనాల్లోకి రాకుండా చేయాలని సర్పంచ్‌కు అధికారులు తెలిపారు.

లట్టుపల్లిని మండలంగా ప్రకటించాలి

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి పంచాయతీతో మరికొన్ని గ్రామాలను కలిపి మండలంగా మార్చాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ వెంకటయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం లట్టుపల్లి పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు కలిసి తహసీల్దార్ అంజిరెడ్డితో మాట్లాడారు. గంగారం చెందిన మూడు గిరిజన పంచాయతీలు, గౌరారం పంచాయతీతో పాటు గిరిజన పంచాయతీ, మంగనూర్ కలిపి 14 వరకు పంచాయతీలను కలిపి మండలం చేయాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామస్తులు సోమవారం వింధ్యవాసిని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నపాయసం సమర్పించారు. సర్పంచ్ కూన కుర్వమ్మ ఆధ్వర్యంలో భజన బృందం తాళమేళాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక హారతులతో ధూప దీపాలు సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామస్తులు అన్నపాయసం అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నపాయసాన్ని ఒక కొండపై పోయగా, దానిని ప్రసాదంగా గ్రామస్తులు స్వీకరించారు.

సామాజిక తనిఖీలో పారదర్శకత



సభలో పాల్గొన్న అధికారులు, కూలీలు

లింగాల: 'ఉపాధి' పనులపై గ్రామాలలో నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలో పారదర్శకత ఉండాలని ఎంపీడీఓ గీతాంజలి తనిఖీ బృందాలకు సూచించారు. సోమవారం మండలంలోని మగ్దూంపూర్ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులపై వివరించారు. ఇప్పటి వరకు ఉపాధి పనులలో అవకతవకలు ఉంటే తనిఖీ బృందాల దృష్టికి తీసుకరావాలని ఎంపీడీఓ కూలీలను, ప్రజలను సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ హన్మంతునాయక్, ఏఓ నాగార్జునరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

18న విశ్వకర్మ ఆత్మగౌరవ బహిరంగసభ



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోడేరు: విశ్వకర్మ ఆత్మగౌరవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పాండురంగాచారి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సభ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలు సమాజంలో ఆర్థికంగా చాలా వెనకబడి ఉన్నారని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 18న నాగర్‌కర్నూల్ సాయిగార్డెన్‌లో సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవీందర్, శ్రీకాంతాచారి, కృష్ణయ్యచారి, చిన్న ఆంజనేయులు, కరుణాకర్, వినోద్, రఘు, పస్పుల రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పెంట్లవెల్లి: మండలంలోని యంగంపల్లితండాలో సోమవారం ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి గ్రామస్తులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సమాజంలో సైబర్ నేరగాళ్ల మోసాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో కొత్తగా ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం అడిగితే ఇవ్వకూడదని, పదే పదే ఫోన్ చేస్తే తెలిసిన వారికి విషయం చెప్పాలని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి, ఏఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదు

చారకొండ: గ్రామాల్లో రైతులు సాగు చేసే పంటలను వ్యవసాయ అధికారుల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ తెలిపారు. తిమ్మాయిపల్లిలో ఏఈఓ సోమవారం పొలాలకి వెళ్లి రైతుల వద్ద సర్వే నంబర్ల వారీగా నమోదు చేపట్టారు.

మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ల సన్మానం

అచ్చంపేట: స్థానిక మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీహరిరాజును సోమవారం కౌన్సిలర్లు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని, గతంలో చేసిన అనుభవంతో మంచి పేరు తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మన్నుప్రసాద్, అంతటి శివ, తగురం శ్రీనివాసులు, రమేష్, సోమ్లానాయక్, సుంకరి బాలరాజు ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



తాడూరు: మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం జెడ్పీ సీఈఓ ఉష ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది, వివిధ రికార్డులు కార్యాలయ నిర్వహణ వివరాలను ఎంపీడీఓ గంగామోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

కాల్వ బాట మూసివేయడం సరికాదు



కాల్వ వద్ద రైతులతో మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో కేఎల్‌ఐ కాల్వకు సంబంధించిన బాటను పరిసర పొలాల రైతులు అకస్మాత్తుగా నిలపేశారు. దీంతో కాల్వకు ఇరువైపుల ఉండే దారి వెంట ఆయా భూములకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సోమవారం మాలమహానాడు నాయకులు చింత సత్తి కురుమూర్తి, కుర్మయ్య కాల్వ వద్దకు వెళ్లి పరిశీలించారు. కాల్వ పక్కన బంద్ చేసిన పరిసరాల్లో దళితులకు సంబంధించిన భూములే ఉన్నాయని వారిని వెళ్లకుండా అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని సర్దిచెప్పారు. అనంతరం కేఎల్‌ఐకి సంబంధించిన ఇంజినీర్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కర్నె శ్రీను, కాశీవిశ్వనాథ్, బాలస్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుగుబాటు యాత్ర జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: బహుజన తిరుగుబాటు యాత్రను జయప్రదం చేయాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గద్దం విజయ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో యాత్రను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం యాత్రకు కరపత్రాలను విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పార్టీలన్నీ అగ్రకులాలకు చెందిన మనువాద పార్టీలేనన్నారు. వారి ఎజెండా ఒక్కటేనని, 15 శాతం ఉన్న అగ్రకులాల ప్రయోజనం కోసం మాత్రమే పనిచేస్తాయని, 85 శాతం ఉన్న బహుజనులకు బానిసలుగా చేశాయని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం రానున్న ఎన్నికల్లో సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కృష్ణానది ద్వారా 600 టీఎంసీలను జిల్లాకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నరేందర్, చంద్రస్వామి, బండి విజయ్, శ్రీను, శేఖర్, రైతులు వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గద్దం విజయ్

బీఎస్పీలో చేరిక



తెలకపల్లి: జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ ఆధ్వర్యంలో సృజన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళా హక్కులు, సమానత్వం కోసం బీఎస్పీ పాటుపడుతుందని అందుకే పార్టీలో చేరానన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, మహేష్‌యాదవ్, శివశంకర్, మల్లేష్, బాలనాగయ్య, రాజేష్ తదితరులు ఉన్నారు.

అభ్యసనానికి గ్రంథాలయాల తోడ్పాటు

అచ్చంపేట: విద్యార్థుల అభ్యసనానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడుతాయని సెక్టోరియల్ అధికారి షర్ఫుద్దీన్ అన్నారు. సోమవారం మండలంలోని సిద్దాపూర్, జోగ్యతండా, చీన్యాతండా, కిష్టుతండా, కొర్రతండా, బ్రహ్మణపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ సమయం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు ప్రార్థన సమయంలో తరగతి గదిలో పఠన కార్యక్రమం కొనసాగించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని, పఠనోత్సవంలో భాగంగా విద్యార్థులచే పుస్తకాల పఠనం చేయించి వారిలో పఠనాసక్తిని పెంపొందించాలని కోరారు.

కల్వకుర్తి: పట్టణంలోని శుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం గ్రంథాలయోత్సవాలలో భాగంగా విద్యార్థులకు పఠనోత్సవం నిర్వహించారు. చదువు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. హెచ్‌ఎం జలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

బల్మూర్: మండలంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలందరికి ప్రభుత్వం పంపిణీ చేయాలని ప్రజాసంఘాల పోరాట వేదిక మండల కన్వీనర్ శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. స్థలాలు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారి మహేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో లాల్‌అహ్మద్, ఆంజనేయులు, కృష్ణయ్య, భారిమామ్, రాయుడు, శ్రీరాం, షరీఫా, లక్ష్మమ్మ పలువురు పాల్గొన్నారు.



బల్మూర్‌లో ధర్నా చేస్తున్న పేదలు

'ప్రజావాణి'కి అధికారుల గైర్హాజరు



పెంట్లవెల్లిలో హాజరుకాని అధికారులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఈ వారం కూడా అధికారులు హాజరుకాలేదు. ప్రతి వారం హాజరుకావాలని తహసీల్దార్ దామోదర్ తెలియజేస్తున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల సమస్యలకు ప్రజావాణిలో పరిష్కారం దొరుకుతుందని ఎంతో ఆశతో వస్తుంటే అధికారులు ఎందుకు హాజరుకావడం లేదని తహసిల్దార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం

చారకొండ: ప్రజావాణిలో అందిన సమస్యలకు తక్షణమే సంబంధిత అధికారులతో పరిష్కరిస్తామని డీటీ విద్యాధరి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మండలంలోని గోకారం నుంచి భూ సంబంధిత సమస్యలపై రెండు దరఖాస్తులు వచ్చినట్లు డీటీ తెలిపారు. వాటిని వెంటనే ఆర్‌ఐ, సర్వేయర్‌లతో పరిష్కారం చేస్తామని తెలిపారు.

ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత

లింగాల: గ్రామాలలోని ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేయించాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి కృష్ణ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. త్వరలో మండలంలో కేంద్ర బృందం పర్యటన ఉంటుందని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం తగదని డీపీఓ అన్నారు. పలు పనులపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ గీతాంజలి పాల్గొన్నారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోండి

సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీపీఓ కృష్ణ ప్రజలను కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్నారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి దోహదపడుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకావాలని సూచించారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

తాడూరు: బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండా మణెమ్మ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం ఆమె మండలంలోని ఐతోల్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కిషన్, ఆంజనేయులు, బాలమణెమ్మ, కొండా నాగేష్, వెంకట్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో సోమవారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి కార్యకర్తలు శ్రీకాంత్‌భీమా ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఏ సమస్య వచ్చినా పార్టీ పరంగా అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, అరవింద్, భాస్కర్, యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్య రైతుల జాతీయ దినోత్సవం

లింగాల: మండల కేంద్రంలో సోమవారం మత్స్య రైతుల జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మత్స్యకారులు తరలివచ్చి ర్యాలీ చేపట్టారు. కొత్త బస్టాండ్ వద్ద కేక్ కట్ చేశారు. మత్స్యకారులను ప్రభుత్వ అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యం, వెంకటయ్య, సలేశ్వరం, శ్రీనివాసులు, లక్ష్మయ్య, చెన్నయ్య, కృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



వెల్దండ: మండలంలోని ఉబ్బలగట్టుతండాలో కొత్తగా నిర్మిస్తున్న ట్యాంకు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఉబ్బలగట్టుతండా, బండోనిపల్లిలో ఆయన పర్యటించారు. పంచాయతీల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టీఏ సత్యనారాయణ, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఊర్కొండ: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు నష్టం కలిగించే కొత్త పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత విధానం అమలు చేయాలని సీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. మండ కేంద్రంలో సోమవారం సీపీఎస్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. 17న జిల్లా కేంద్రంలో రథయాత్రను, ఆగస్టు 12న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వివిధ శాఖల్లోని ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల వద్ద వసతులు కల్పించండి

పెద్దకొత్తపల్లి: గ్రామాలలోని కొత్తగా నిర్మించిన శ్మశానవాటికల వద్ద నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో మురుగు కాల్వలోకి వెళ్లే ముందు ఇంకుడు గుంతలకు వెళ్ల కాల్వలోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో బహిర్భూమికి వెళ్లకుండా ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కొత్తవారిని నియమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఈసీ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

